నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 16 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

| మంచిర్యాల | |
|---|---|
| సంవత్సరం | 2023 |
| సమకూరిన ఆదాయం | రూ. 72 కోట్లు |
| సంవత్సరం | 2024 |
| సమకూరిన ఆదాయం | రూ. 59 కోట్లు |

| కుమ్రం భీం ఆసిఫాబాద్ | |
|---|---|
| సంవత్సరం | 2023 |
| సమకూరిన ఆదాయం | రూ. 79 కోట్లు |
| సంవత్సరం | 2024 |
| సమకూరిన ఆదాయం | రూ. 59 కోట్లు |


చికిత్స పొందుతున్న భీమాబాయిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి జోగు రామన్న
- చిరుత దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితురాలికి పరామర్శ

ఎదులాపురం, డిసెంబర్ 15 : వరుస పులుల దాడులు పెరిగి పోతుండడంతో ప్రభుత్వం, అటవీ శాఖ మంత్రి భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రామన్న మండిపడ్డారు. ఇటీవల బజార్హత్నూర్ మండలంలోని డెడ్రా గ్రామంలో చిరుత దాడిలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న భీమాబాయిని ఆయన పరామర్శించారు. ఘటన జరిగిన వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. చిరుత దాడి చేసినప్పటికీ ధైర్యంతో ఆమె ఎదురించి ప్రాణాలు కాపాడుకుందని కుటుంబ సభ్యులు వివరించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్‌ను కూడా పరామర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో పులుల సంచారం పెరగడంతో అవి అమాయక ప్రజలపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. అటవీ శాఖ మంత్రి, అధికార పార్టీ నేతలు, అధికారులు బాధితులకు అండగా నిలబడకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, గంద్రత్ రమేశ్, సెవ్వ జగదీశ్, సయ్యద్ సాజిదొద్దీన్, కుమ్ర రాజు, ధమ్మ పాల్, ప్రశాంత్, సురేందర్ పాల్గొన్నారు.


పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# యువకులు రాజకీయాల్లో రాణించాలి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- ఎమ్మెల్యే పనితీరుతోనే పార్టీలో చేరిక
- బుద్దికొండ యువకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే

నేరడిగొండ, డిసెంబర్ 15 : యువకులు రాజకీయాల్లో కూడా రాణిస్తే ప్రజలకు సేవ చేయడానికి అవకాశం ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన 20 మంది యువకులు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సమక్షంలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన యువ నాయకులు లవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో యువకులంతా జాదవ్ అనిల్‌తో కలిసి నడుస్తామని తెలిపారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ సేవ చేస్తున్న ఎమ్మెల్యే పనితీరును చూసి పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాన్ టీచింగ్ వర్కర్స్

# కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ నిరసన

భైంసా, డిసెంబర్ 15 : కస్తుర్బా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌కు కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. కేవలం రూ.9,750 వేతనం చెల్లిస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటున్నారన్నారు. కనీస ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ వంటివి కల్పించాలన్నారు. ఇందులో నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సునీత, సాగర, గోదావరి, లక్ష్మి, గంగాసాగర, మౌనిక, గోపమ్మ ఉన్నారు.


జాతీయ రహదారిపై కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

# రేవంత్ సర్కారుపై ఉద్యోగుల నిరసన

## డిమాండ్స్‌ను నెరవేర్చాలని కండ్లకు గంతలు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 15 : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్స్‌ను వెంటనే నెరవేర్చి, తమను రెగ్యులర్ చేయాలని నిరసిస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టిన నిరవధిక సమ్మె రోజుకో రీతిలో కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా ఆదివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట గల జాతీయ రహదారిపై కండ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. సీఎం సారూ మా హామీలేమయ్యాయి? అంటూ ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్స్‌ను పరిష్కరించాలని కోరుతూ ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. సమ్మెకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షులు రాములు, సురేశ్‌లు వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, ఆనంద్, హరీశ్, స్పందన్, విజయ్, నవిత, వీణ, అపర్ణ, గంగామణి, ప్రభ, జ్యోతి, శ్రీతల దేవి, సాయినాథ్, వివేక్ రాజు నాయక్, నారాయణ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి** వచ్చిన ఏడాది కాలంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గృహాలు, ఓపెన్ ప్లాట్లు, వివాహాలు, ఇతర ఫర్మ్ రిజిస్ట్రేషన్‌ల మీద రావాల్సి ఆదాయం దాదాపుగా 15 శాతం తగ్గింది. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.174 కోట్ల ఆదాయం రాగా, ఇదే కాల పరిమితిలో గతేడాది 2023లో రూ.205 కోట్లు, 2022లో రూ.213 కోట్ల ఆదాయం సమకూరింది. గత రెండు, మూడేండ్లలో ఒక వెలుగు వెలిగిన రియల్ ఎస్టేట్ ప్రస్తుతం ఢీలా పడడంతో రియల్టర్‌లు రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి నెలకున్నది. కొన్నాళ్లుగా జోరు మీదున్న స్థిరాస్తి రంగం నానాటికీ అధోగతికి చేరుకుంటున్నది. సాధారణ స్థితికి భిన్నంగా ఏడాదిన్నరగా స్థిరాస్తి వ్యాపారం అంతగా సాగడం లేదు. అమ్మేవారు తప్ప కొనేవారు ఎవరూ లేకపోవడంతో బిజినెస్ మందగించింది. వ్యవసాయ భూములతోపాటు వ్యవసాయేతర భూముల(ప్లాట్ల) అమ్మకాలు, కొనుగోళ్లు భారీగా తగ్గిపోయాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే రిజిస్ట్రేషన్, తహసీల్దార్ కార్యాలయాలు వెలవెలబోయి కనిపిస్తున్నాయి. భూముల ధరలు విపరీతంగా ఉండడం, కొన్న తర్వాత మళ్లీ పెరిగే అవకాశం కనిపించకపోవడం వంటి కారణాలతో రియల్ రంగం అంతకంతకు మందగిస్తోందని ఆ రంగంలోని నిపుణులు చెబుతున్న మాట. కాగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్‌లు తగ్గడంతో సర్కార్ ఆదాయానికి భారీగా కోత పడింది. హైడ్రా ద్వారా భూముల కొనుగోలుకు అంతగా ఆసక్తి చూపకపోవడంతో భూమి కొనుగోళ్లకు బ్రేక్ పడింది.

*- మంచిర్యాల, డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# రియల్ ఢమాల్



## కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తగ్గిన రిజిస్ట్రేషన్లు

## సర్కార్‌కు రావాల్సిన ఆదాయానికి గండి

**సర్కారుకు సమకూరిన ఆదాయం**

| సంవత్సరం | డాక్యుమెంట్లు | డబ్బులు |
|---|---|---|
| 2023 | 61,363 | రూ.205 కోట్లు |
| 2024 | 43497 | రూ.174 కోట్లు |

**జిల్లాలవారీగా రిజిస్ట్రేషన్లు**

| | |
|---|---|
| జిల్లా | ఆదిలాబాద్ |
| సంవత్సరం | 2023 |
| సమకూరిన ఆదాయం | రూ.62కోట్లు |
| సంవత్సరం | 2024 |
| సమకూరిన ఆదాయం | రూ.32 కోట్లు |

**నిర్మల్ జిల్లా**

| | |
|---|---|
| సంవత్సరం | 2023 |
| సమకూరిన ఆదాయం | రూ.64కోట్లు |
| సంవత్సరం | 2024 |
| సమకూరిన ఆదాయం | రూ.29 కోట్లు |


పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా


కేంద్రాన్ని పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# గ్రూప్-2 ప్రశాంతం

## పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, డిసెంబర్ 15 : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఆదివారం గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. అభ్యర్థులు పరీక్ష సమయాని కంటే గంట ముందే కేంద్రానికి చేరుకున్నారు. అయితే నిమిషం అలస్యం నిబంధన కారణంగా పలువురు అభ్యర్థులు వెనుదిరాగాల్సి వచ్చింది. ఆయా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కేంద్రాలను ఎస్పీ గౌష్ ఆలం సందర్శించి బందోబస్తును పరిశీలించారు. మావలలోని చావర అకాడమీ, మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే, భుక్తపూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఉదయం 10,428 మందికి 5,905 మంది హాజరు కాగా.. 4,523 మంది గైర్హాజరయ్యారు. సోమవారం కూడా పరీక్ష ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ఉంటుందన్నారు.

### కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 15 : నిర్మల్ జిల్లాలో గ్రూప్-2 పరీక్ష ఆదివారం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని దీక్ష, వశిష్ట డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఉదయం పేపర్-1 పరీక్షకు 8,080 మందికి 4,146 హాజరు కాగా.. 3,934 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. నిమిషం నిబంధనతో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పలు సెంటర్లలో లోపలికి అనుమతించ లేదు. సోమవారం పేపర్-3, పేపర్-4 పరీక్షను నిర్వహించనున్నారు. కలెక్టర్ వెంట రీజినల్ కో-ఆర్డినేటర్ రెడ్డి, పర్యవేక్షణ అధికారులు శ్రీనివాస్, గోపాల్, రవికుమార్, తహసీల్దార్ రాజు, సంతోష్ ఉన్నారు.


నిమిషం నిబంధనతో గేటు బయట అభ్యర్థి

# ఫిక్స్‌డ్ వేతనం ఇచ్చే వరకు పోరాటం

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలి
- ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి
- జిల్లాలో ప్రారంభమైన బస్సు జాత


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి

ఎదులాపురం, డిసెంబర్ 15 : ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలని, ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల రాష్ట్ర బస్ జాతలో భాగంగా ఆదివారం ఆదిలాబాద్‌కు చేరుకున్న బృందం సభ్యులతో కలిసి వచ్చిన ఆమె స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆశ వర్కర్ల సమస్య త్వరగా పరిష్కారం కావాలంటే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని అందుకే బస్ జాతను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 30 వేల మంది ఆశ వర్కర్లను ఇబ్బందులకు గురిచేయడం తగదని, ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నీలాదేవీ, కోశాధికారి గంగామణి, బృందం సభ్యులు సునీత, సాధన, బాలమణి, సంఘం జిల్లా అధ్యక్షురాలు శోభ, కార్యదర్శి ఎం.సుజాత, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షురాలు డి. వెంకటమ్మ, నాయకులు డి.సునీత, ఆశ యూనియన్ నాయకులు లక్ష్మి, సంగీత, పుష్ప పాల్గొన్నారు.

# ఆరో రోజు అదే జోరు

## కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ఎదులాపురం, డిసెంబర్ 15 : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె ఆరో రోజుకు చేరుకున్నది. కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న సమ్మెకు ఆదివారం ఉద్యోగుల పిల్లలు మద్దతు తెలిపారు. రోజంత కూర్చొని నిరసన తెలిపారు. సీఎం సారు వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ సమ్మెలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాట్లాడుతూ.. ఒక్క సినిమా తొక్కిసలాటలో చనిపోతే స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి, నిన్న ప్రమాదంలో చనిపోయిన యాకయ్య మరణంపై స్పందించకపోవడం సిగ్గుగా ఉందన్నారు. ఎంఈవోలు సోమయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, భూమారెడ్డి, పోశెట్టి, కాంప్లెక్స్ హెచ్ఎంలు కుర్ర రమేశ్, విజయలక్ష్మి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి, కేశవ్, వెంకటి, శ్రీకాంత్, ప్రియాంక, నవీన, మమత, భారతి, జ్యోతి, రాకేశ్, సురేశ్, భోజన్న, సురేందర్, పోచన్న, సలీం, రమేశ్, వెంకన్న, సోమన్న, చిరంజీవి పాల్గొన్నారు.


సమగ్రశిక్ష ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న చిన్నారులు


అర్లి(టీ)లో చలిమంట కాచుకుంటున్న గ్రామస్తులు

# అర్లి(టీ)లో 6.3 కనిష్ఠ ఉష్ణోగ్రత

భీంపూర్, డిసెంబర్ 15 : ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. భీంపూర్ మండలం అర్లి(టీ)లో, జైనథ్‌లో ఆదివారం 6.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్రమైన చలికి చలిమంటలతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.